వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
ప్రభాత వార్త
గురువారం 08 ఆగష్టు 2024

## దస్త్రాల దహనం కేసు సిఐడికి అప్పగింత

మదనపల్లె, ఆగస్టు 7 ప్రభాతవార్త :



మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన దస్త్రాల దహనం కేసుకు సంబంధించి రాష్ట్ర డిజిపి తిరుమల ద్వారకరావు సిఐడికి అప్పగించినట్లు ఆదేశాలు జారీ చేశారు. రెండు రోజుల్లో సిఐడి పోలీసులు దస్త్రాల దహనం కేసుకు సంబంధించి విచారణ చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఇద్దరు ఆర్డీఓలు ఎంఎస్.మురళి, హరిప్రసాద్‌లతో పాటు ఓ సీనియర్ అసిస్టెంట్ గౌతంతేజ్‌లను ప్రభుత్వ సస్పెండ్ చేసింది. ఈ దస్త్రాల కేసులో 8మందిపై కూడా కేసులు నమోదు చేయడం జరిగింది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిఏల ఇళ్ళల్లోనూ, అనుచర నేతలుగా ఉంటున్న వారి ఇళ్లల్లోనూ సోదాలు చేసి కీలకమైన డాక్యుమెంట్లును పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటిలో కూడా సోదాలు చేసి ఆయనపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఇటీవల కర్నూల్ డిఐజి ప్రవీణ్‌కూడా వెల్లడించారు. సిఐడి చేతుల్లోకి దస్త్రాల దహనం కేసు వెళ్ళడంతో వైకాపా కీలక నేతల్లో ఆందోళన నెలకొంది.

## పర్యాటక హబ్‌గా హార్సిలీహిల్స్

**హార్సిలీహిల్స్‌లో సెవన్‌స్టార్ హోటల్ - జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్**



మదనపల్లె, ఆగస్టు 7 ప్రభాతవార్త :

రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరపొందిన హార్సీలీహిల్స్‌ను ప్రభుత్వం త్వరలో పర్యాటక హబ్‌గా గుర్తించనున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆయన జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రతో కలసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు హార్సిలీహిల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయుటకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఈ రంగంలో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి ఇటీవల విజయవాడలో కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతూ పర్యాటక శాఖపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతోనే హార్సిలీహిల్స్‌ను పర్యాటక హబ్‌గా చేయబడుతుందన్నారు. ఏడు నక్షత్రాల హోటల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేటు భాగస్వామ్యులతో ఓబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ వారు నిర్మాణం చేపడుతూ 20ఎకరాల భూమిని పర్యాటక శాఖకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ నేపథ్యంలో హోటల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయుటకు గానూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భూమిని పరిశీలించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, ఏడి సర్వే జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారం లేనిదే విద్యుత్ ప్రమాదాలు నివారించలేం

**: విద్యుత్‌ను భూతంలా చూడాలి**

**: విద్యుత్ అంతరాయాలను పూర్తిగా నివారించాలి**

**: జిల్లా విద్యుత్ శాఖాధికారి ఎస్. రమణ**



బద్వేలు అర్బన్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

ప్రజల సహకారం లేనిదే విద్యుత్ ప్రమాదాలు నివారించలేమని జిల్లా విద్యుత్ శాఖాధికారి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్. రమణ పేర్కొన్నారు. ముందుగా గోపవరం మండలంలోని 33/11కేవి. గానుగపెంట సబ్‌స్టేషన్, తదితర ప్రాతాలలో తిగిరి పరిశీలించి తగు సూచనలు తెలిపారు. అలాగే బద్వేలు, గోపవరం, అట్లూరు, బి.మటం మండలాల అధికారులు మరియు సిబ్బందితో బద్వేలులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు సూచనలు ఇస్తూ లూజులైన్లు తక్కువ ఎత్తులో ఉన్న లైన్ల గురించి యుద్ధ ప్రాతి పదికన తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యం కారణంగానే సంభవిస్తున్నాయని అప్రమతత్తతో వ్యవహరించి ప్రమాదాలను నివారించాలన్నారు. ముఖ్యంగా ఎత్తైన లోడుతో వెళ్లే వాహనాలు పైన ఉన్న విద్యుత్‌లైన్లను గమనించి ముందుకు వెళ్లాలన్నారు. సిబ్బంది విద్యుత్ పనులు చేసేటపుడు తగు చర్యలు పాటించాలని లేకపోతే వారిపై చర్యలు తప్పవన్నారు. అంతేగాక రైతుల విద్యుత్ సమస్యలైన ట్రాన్స్‌ఫార్మర్, ఫీజులు వేయడం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం వంటి తదితర పునలపై స్పందించాలన్నారు. లో వోల్టేజీ సమస్యలు తలెత్తకుండా అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే పగటిపూట వీధిలైట్లు వెలగకుండా చర్యలు చేపట్టాలని, అలా వెలిగినట్లు తన దృష్టికి వస్తే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను పరిష్కరించి సంస్థపై వారి సంతృప్తికర స్థాయిని పెంచే విధంగా విద్యుత్ సేవలందించాలన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచడంలో భాగంగా విద్యుత్ స్తంబాలు తాకకుండా వారికి వివిధ రూపాలలో అవగాహన కల్పించి ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టిసారించాలాన్నారు. అలాగే వినియోగదారుడు విద్యుత్ సమస్యలపై వచ్చినపుడు క్షేత్రస్థాయిలో సిబ్బంది, అధికారులు వారితో మమేకమై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణి క్రిష్ణ, ఏఏఓ శివకుమార్, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కులాయప్ప అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్, రమణ, రవిశంకర్, చిన్నయ్య, జేఈ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ర్యాలీ



రాయచోటి, ఆగస్టు 7, ప్రభాతవార్త:

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం చేనేతపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ కలెక్టరేట్ ఆవరణ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి సాయి ఇంజినీరింగ్ కళాశాల, అక్కడ నుంచి తిరిగి కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాడుతూ ఒకల్ ఫర్ లోకల్ అనే నినాదంతో ప్రజలందరూ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఆగస్టు 7, 1905న స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగిందని ఆ రోజును పురస్కరించుకొని 2015 నుంచి ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో చేనేతతో తయారు చేసిన మదనపల్లి సిల్క్ చీరలను అమ్మే స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. మదనపల్లి సిల్క్ చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. జిల్లా చేనేత మరియు వస్త్ర శాఖాధికారి శ్రీదేవి మాట్లాడుతూ చేనేత పరిశ్రమపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని వారందరి సేవలను గుర్తించుకోవడానికి జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లాలోని వివిధ చేనేత సంఘాలు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### కన్నుల పండువగా

## శ్రీ సత్యనారాయణ స్వామి గ్రామోత్సవం

బద్వేలు అర్బన్, ఆగస్టు 7 ప్రభాతవార్త :

బద్వేలు మున్సిపాలిటీ పరిధి నెల్లూరు రోడ్డు, గౌరిశంకర్‌నగర్‌లో ఇటీవల బ్రాహ్మణ సంఘం కమిటి సభ్యుల సహకారంతో నిర్మాణం చేపట్టిన శ్రీ రమాదేవి సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ ఆదిశంకరాచార్య సహిత, శ్రీ గాయత్రిదేవి, శ్రీ ఆదిత్య అంబిక, విఘ్నగణనాథ సహిత ఉమామహేశ్వర స్వామి, శ్రీ ఆదిత్యాది నవగ్రహ, గరుత్మంత ధ్వజ మరియు ఉత్సవ మూర్తుల సంప్రోక్షణ చల ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్ట మహాకుంభాబిషేక మహోత్సవాలు శ్రావణమాసం సోమవారం నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. కాగా బుధవారం నాటి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా ప్రాతం:కాల పూజ, జపహోమర్చాన, పారాయణ, అభిషేకములు, దీక్షా మంత్రములు, దేవాలయ బలిహరణ, మూలవిరాట్, విగ్రహ మూర్తులు ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే సాయంత్రం ప్రదోష కాల పూజ, దీక్షా హోమము, మహాస్నపనము, సుగంధ పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో మొదటిసారిగా సత్యనారాయణస్వామి ఆలయాన్ని నిర్మించడంతో పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలవారు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అలాగే గ్రామోత్సవం వెంట పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చెప్పలి వెంకటేశ్వర్లు, బ్రాహ్మణ సంఘం కమిటి గౌరవాధ్యక్షులు ఎ.నాగరాజుశర్మ, హనుమంతరావు, రాజేశ్వరరావు, సీతారామశాస్త్రి, సత్యనారాయణ శర్మ, గౌరవసలహాదారులు రాయపెద్ది సుబ్బరామశర్మ, ప్రధాన కార్యదర్శి తంగి సత్యనారాయణశర్మ, కోశాధికారి బోయలకుంట్ల సుబ్బనరసయ్య, ఉపాధ్యక్షులు సింగనమల శివ ప్రసాదరావు, తీర్థాల నాగరాజశర్మ, హెచ్ఎల్. మదుసూధనరావు, ప్రభాకరశాస్త్రితో పాటు పలువురు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

## దేవస్థాన మరమ్మత్తులకు దాతల సహాయం ప్రశంసనీయం



ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 07, ప్రభాతవార్త:

చెన్నకేశవ స్వామి దేవస్థాన మరమ్మ త్తులకు దాతల సహాయం ప్రశంసనీ యమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కొనిఆడారు. బుధవారం స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీ మహాలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి ఆలయప్రాంగణం నందు సపట పూర్తిగా దెబ్బతిన్నందున ఆలయానికి వచ్చిపోయే భక్తులకు అసౌకర్యంగా ఉన్నదని పట్టణంలోని దాతల నుండి చందాలను వసూలు చేసి 50లక్షల రూపాయలతో దసర ఉత్సవ కమిటి వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతనముఖద్వారం, సపటను ఆయన ప్రారంభించారు. ముందుగా స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సంధర్భంగా అర్చకులు ఆయనకు ఆహ్వానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దసరా ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణలో ముఖ్యమైన ఆలయమైన చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రజలకు అసౌకర్యం లేకుండా దాతలు ముందుకు వచ్చి పూర్తి చేయడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్ రెడ్డి, నాయకులు మెట్టుపల్లె రామచంద్రారెడ్డి, మార్తల లక్ష్మిరెడ్డి, వద్ది బాలుడు తదితరులు పాల్గొన్నారు.

## వాలీబాల్ జట్టుకి ఎంపికైన నరసింహారావు

కాశినాయన , ఆగస్టు 7 ప్రభాతవార్త :

కాశినయన మండలం వరికుంట్ల గ్రామ పంచాయతీలోని నాయనపల్లె గ్రామానికి చెందిన తలారి నరసింహారావు జాతీయ స్థాయిలో వాలీబాల్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి ఇంటర్నేషనల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయననను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ గోవిందరెడ్డి అభినందించారు. ఆయన మాట్లాడుతూ కేరళలలో నిరుపేద విద్యార్థులు మంచి నైపుణ్యాన్ని కనపరచడంతోపాటు వారు జాతీయ స్థాయికి ఎంపిక కావడం అలాగే అంతర్జాతీయ స్థాయికి వెళ్లడ సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఓబళరెడ్డి, వెంకటరెడ్డి, జయరామిరెడ్డి, శంకరయ్య, తిరుపాల్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



## ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని ఆత్మహత్య

వేంపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త ః



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ప్రాంగణంలో ఉన్న ఒంగోలు క్యాంపస్‌లో పీ2 చదువుతున్న జమీషా ఖురేషి(17) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీ క్యాపంస్‌లలో విషాధం చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా చీరాల మండలం ఈపురుపాళెం గ్రామానికి చెందిన మగ్బూల్, నసీమల కుమార్తె జమీషాఖురేషీ ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో సీటు రావడంతో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. మంగళవారం రాత్రి బాత్రూమ్‌లో వాటర్‌పైపునకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. మంగళవారం ఫైనలియర్‌కు చెందిన ఓ విద్యార్థిని మొబైల్‌ఫోన్ క్యాంటిన్ వద్ద పోయింది. మొబైల్‌ఫోన్‌ను మృతి చెందిన అమ్మాయి తీసుకున్న విషయాన్ని ట్రిపుల్‌ఐటీ అధికారులు గుర్తించి విద్యార్థిని మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థిని స్టడీ అవర్స్‌కు రాకపోవడంతో ఆమె కోసం వెతికినట్లు ట్రిపుల్‌ఐటీ అధికారులు తెలిపారు. రాత్రి 11.00గంటలకు బాత్‌రూంలో ఆత్మహత్య చేసుకున్న విషయం బయట పడడంతో విద్యార్థులు, సిబ్బంది ట్రిపుల్‌ఐటీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఇడుపులపాయలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి జమీషాఖురేషీ మృతిచెందినట్లు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థిని మృతిచెందిన విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ మురళినాయక్ వేంపల్లె ఆసుపత్రికి వచ్చి విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించడంతో పాటు మృతురాలి తల్లిదండ్రులను, ట్రిపుల్‌ఐటీ అధికారులను, విద్యార్థులను ఘటనపై విచారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్.కె.వ్యాలీ ఎస్సై రంగారావు తెలిపారు.

**- విద్యార్థిని మృతి బాధాకరం ః** ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మంగళవారం జమీషాఖురేషీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం ఉంచిన మృతదేహాన్ని చూసి విద్యార్థిని తల్లిని ఆయన పరామర్శించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన సాంకేతిక విద్యను అందించాలన్న గొప్ప ఆశయంతో 2008లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ట్రిపుల్‌ఐటీలను ఏర్పాటు చేశారన్నారు. ప్రతిభావంతులైన పిల్లల జీవితాలు ఆత్మహత్యలతో అర్ధాంతరంగా ముగిసిపోవడం బాధాకరం అన్నారు. ట్రిపుల్‌ఐటీ అధికారులు, కళాశాలల యాజమాన్యం, ఫ్యాకల్టీ, పెద్దవాళ్లు చాలా జాగ్రత్తలతో ప్రవర్తించాలని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని తులసిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, ఉత్తన్న, సుబ్బరాయుడు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలపై

## ధ్వజమెత్తిన కౌన్సిలర్‌లు

4వ పేజీలో

### అంగన్‌వాడీ సెంటర్లకు పిల్లలు

## వంద శాతం హాజరయ్యేలా చూడాలి

- పిల్లలకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన భోజనం ఇవ్వాలి
- ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

రాయచోటి, ఆగస్టు 7, ప్రభాతవార్త:

అంగన్‌వాడీ సెంటర్లకు పిల్లలు వంద శాతం హాజరయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, బీపీసీ, డీపీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఉన్న అన్ని అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలు తప్పకుండా వంద శాతం హాజరయ్యేలా చూడాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. పిల్లలకు ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రతి చిన్నారి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలలా చూడాలన్నారు. ఆయా మొదలుకొని సూపర్‌వైజర్ వరకు చిన్నారుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఎత్తు, బరువు తక్కువగా ఉన్న పిల్లల సంఖ్య ఎక్కువగా ఉండడానికి గల కారణాలను గుర్తించి వారిని వైద్యాధికారి వద్దకు తీసుకెళ్లి ఎత్తు, బరువు తగ్గడానికి గల కారణాలను తెలుసుకొని తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయి, అబ్బాయి జీవితం నాశనం అవుతుందని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శశికళ, సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, బీపీసీలు, డీపీసీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత అభివృద్ధికి పాటుపడాలి

**- ప్రతి ఉద్యోగి ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించాలి - చేనేత వస్త్రాలు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ఆనవాళ్లు - జిల్లా కలెక్టర్ శివశంకర్**

కడప, ఆగస్టు 7, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత అభివృద్ధికి పాటుపడాలని, ప్రతి ఉద్యోగి ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించాలని జిల్లా కలెక్టర్ శిశశంకర్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీటింగ్ హాలు నందు జిల్లా చేనేత మరియు జౌళిశాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం అతి ఘనంగా జరిగింది. తొలుత జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జాతిపిత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం చేనేత ప్రభుత్వమని చేనేతలను ప్రోత్సహించి వారిని ఉన్నత స్థితికి తీసుకుని రావడమే ధ్యేయంగా ధ్యేయంగా ముందుకెళ్తామన్నారు. ప్రొద్దుటూరులో తయారయ్యే దూపియానా సిల్క్ వస్త్రం మాధవరంలో తయారయ్యే పట్టు చీరలకు మరింత ప్రచారం కల్పించి ప్రాధాన్యతను ఇస్తామన్నారు. తనకు చేనేత రంగ అభివృద్ధికి తగు సలహాలు సూచనలు ఇస్తే చేనేత రంగానికి చేయూతనిస్తామని చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం ఆగస్టు 7న దేశవ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించి స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా చేనేత నిలిచిందన్నారు. 1905లో కలకత్తాలో జాతిపిత మహాత్మాగాంధీ బాలగంగాధర్ తిలక్ బిపిన్ చంద్రపాల్ మరియు లాలా లజపతిరాయ్ నాయకత్వంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రారంభమైన స్వదేశీ ఉద్యమంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే చారిత్రాత్మక పిలుపు జాతీయ చేనేత దినోత్సవాన్ని గుర్తు తెస్తుందన్నారు. చేనేతలకు ఏవేని ప్రభుత్వ పథకాలు ఉన్నాయో వాటన్నిటిని చేనేతకు అందించడం జరుగుతుందని మొదటగా మైలవరం పరిధిలో మొదలుపెట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కడప శిల్పారామంలో ప్రతి శని, ఆదివారాలలో చేనేత వస్త్ర ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని, అలాగే సాంస్కృతికి కార్యక్రమాలు కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున 300 మందికి మూడు కోట్ల రూపాయలను చేనేత కళాకారులకు వీవర్స్ ముద్ర రుణ వితరణ మెగ చెక్కును అందించడం అభినందనీయమన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చేనేత కళాకారులకు అభినందనలు తెలుపుతూ చేనేత అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని చేనేతల వెన్నంటే ఉంటామన్నారు. రోటరీ క్లబ్ డిస్టిక్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ మాట్లాడుతూ చేనేతల అభివృద్ధికి రోటరీ క్లబ్ సహాయసహకారాలు అందించడం జరుగుతుందని చేనేత కళాకారులకు అండగా ఉండి బలోపేతం చేసి ప్రపంచస్థాయిలో పేరు ఉండేలా కృషి చేస్తామన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత మరియు జౌళిశాఖ అధికారి నాగరాజరావు, ఎల్‌డిఎం జనార్ధన్‌రావు, జిల్లా సహకార అధికారి సుభాషిణి, సాంఘీక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, ఇతర జిల్లా అధికారులు, చేనేత కళాకారులు తదితరులు పాల్గొన్నారు.





# గండి దేవస్థాన చైర్మన్‌గా వెంకటస్వామి

**వేంపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త ః**



గండి వీరాంజనేయస్వామి దేవస్థాన ఛైర్మన్‌గా కల్లూరు వెంకటస్వామిని ఎంపిక చేశారు. ఈ మేరకు పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో గండి దేవస్థాన ఛైర్మన్‌గా కల్లూరు వెంకటస్వామిని ప్రకటించారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఆదేశాల మేరకు వెంకటస్వామిని ప్రకటించడం జరిగిందని రఘునాథరెడ్డి అన్నారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఆయనకు ఈ అవకాశం కల్పించామని, ఆలయ పవిత్రతతో పాటు అభివృద్ధికి కృషి చేయాలని వెంకటస్వామికి సూచించారు. అలాగే పార్టీ అభివృద్ధికి కృషి చేసిన చెంద్రాయుడును తదుపరి ఛైర్మన్‌గా నియమించేందుకు బీటెక్ రవి హామీ ఇచ్చారన్నారు. అంతేకాకుండా వేంపల్లె పాపఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మి వృషభాచలేశ్వరస్వామి దేవస్థాన ఛైర్మన్‌గా వెంకటరమణను ప్రకటిస్తున్నట్లు రఘునాథరెడ్డి వెల్లడించారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి మరిన్ని పదవులు వచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు రామమునిరెడ్డి పాల్గొన్నారు.

# కొండాపురం సీఐగా మహమ్మద్ రఫి బధ్యతలు

**కొండాపురం, ఆగస్టు 7, ప్రభాతవార్త ః**

కొండాపురం పోలీసుస్టేషన్ సీఐగా బుధవారం పి.మహమ్మద్ రఫి బాధ్యతలు చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణకు అహర్నిశలు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతూ ఉంటే ప్రజలు తమ దృష్టికి తేవాలని ఆయన కోరారు.

# కొండాపురం తహసీల్దారుగా మాధవ కృష్ణారెడ్డి

**కొండాపురం, ఆగస్టు 7, ప్రభాతవార్త ః**

కొండాపురం తహసీల్దారుగా కె.మాదశకృష్ణారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కొండాపురం తహసీల్దారుగా కె.మాధవకృష్ణారెడ్డి నియమితులయ్యారు. రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారును సిబ్బంది సన్మానించారు.

# కరవు మండలంగా ప్రకటించాలి

**వీరపునాయునిపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త ః**



వీరపునాయునిపల్లె ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీపీ రఘునాథరెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ మండలంలో తీవ్ర వర్షాభావం నెలకొందని, అందువలన మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని సభ్యులచే తీర్మానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా గ్రామాల్లో కూడా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటి సమస్య వస్తోందని అన్నారు. తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ అహమ్మద్ పాహా మాట్లాడుతూ 60ఏళ్లకు పైబడిన వారికి క్షయవ్యాధికి సంబంధించి వ్యాక్సిన్ ఇస్తున్నామని, ప్రతి సోమవారం ఇస్తామని, అందరువచ్చి ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవాలని, వీటిపైన ఉన్న అపోహలను నమ్మవద్దని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎంఈవో జాఫర్ మాట్లాడుతూ మండలంలో 10మందిలోపు విద్యార్థులు ఉన్న స్కూళ్లు 12 ఉన్నాయని, వాటిని త్వరలోనే తాత్కాలికంగా మూత వేస్తామని ఆయన సభ దృష్టికి తెచ్చారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు స్పందించి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఏవో శ్యాంబాబు మాట్లాడుతూ ఈ-పంట నమోదు కార్యక్రమంలో రైతులు తప్పని సరిగా వారు సాగుచేసిన పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ ప్యాక్‌హౌస్‌లు, స్ప్రింక్లర్లు, డ్రిప్‌లు అందుబాటులో ఉంటాయని, వాటిని అర్హులకు ఇస్తామని, వీటి కోసం రైతులు రైతుసేవాకేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, తమసీల్దారు లక్ష్మీదేవి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు

**వీరపునాయునిపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త ః**



వీరపునాయునిపల్లె మండల తహసీల్దారుగా లక్ష్మీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె విలకర్లతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

# డీఐజీ కోయప్రవీణ్‌ను కలిసిన బీటెక్ రవి

**పులివెందుల రూరల్, ఆగస్టు 7, ప్రభాతవార్త ః**




కర్నూలు, కడప రేంజ్ నూతన డీఐజీ కోయప్రవీణ్‌ను పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) కలిశారు. డీఐజీ కార్యాలయంలో బుధవారం డీఐజీ కోయ ప్రవీణ్‌ను బీటెక్ రవి కలిసి సన్మానించారు.

# యూసీఐఎల్‌ను సందర్శించిన యోగివేమన విద్యార్థులు

**పులివెందుల రూరల్, ఆగస్టు 7, ప్రభాతవార్త ః**



వేముల మండలంలోని ఎం.తుమ్మలపల్లె యురేనియం కర్మాగారాన్ని యోగివేమన విశ్వవిద్యాలయ విద్యార్థులు బుధవారం సందర్శించారు. జిలాయజీ విభాగానికి చెందిన విద్యార్థులు, అధ్యాపకులు యూసీఐఎల్ తుమ్మలపల్లె యూనిట్‌లోని యురేనియం ఖనిజ ప్రాసెసింగ్ సౌకర్యాలను సందర్శించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ 2024లో 70ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇందులో భాగంగా యూసీఐఎల్ ఫ్లాగ్‌సిప్ కింద అనేక ఈవెంట్‌లు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో యురేనియం అధికారులు, యూనివర్శిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# నాగాయ పేట మార్గానికి మోక్షమెప్పుడు

**పెనగలూరు, ఆగష్టు07, ప్రభాతవవార్త :**



మండలం నుండి నాగాయపేటకు వెళ్లే దారంతా ప్యాచీలు, గుతల మయంతో రోడ్డు మార్గం దర్శనమిస్తుంది. ఈ మార్గాన ప్రయాణం చేస్తే వాహనాలు కూడా కొన్నాళ్లకే షెడ్ కి వెళ్లాల్సిందేనని స్థానికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుండి సిద్ధవటం, పెనగలూరు, నాగాయపేట, ఓబిలి గ్రామాలకు అలాగే పొరుగు మండలంల అయిన నందలూరుకు వెళ్లాలన్నా ఈ మార్గాన్నే వెళ్లాల్సి ఉంటుంది. ఉదయం సాయంత్రం సమయాన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. దీనిపై అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించకపోతే నష్ట వాటిల్లుతుందని ప్రజలు తెలుపుతున్నారు.

# వీఆర్‌ఏలకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

**తొండూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త ః**



వీఆర్ఏలకు పనికితగ్గ వేతనం ఇవ్వాలని ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. ధైర్యం తెలిపారు. బుధవారం నూతన తహసీల్దారు రామచంద్రుడును ఆయన కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60ఏళ్ల పైబడిన వారు విధుల్లో ఉండడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, అలాంటి వారికి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# వందశాతం సబ్సిడీతో పంట్లతోటల పెంపకం

**తొండూరు, ఆగస్టు 7, ప్రభాతవార్త ః**

పండ్లతోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా వందశాతం సబ్సిడీతో ప్రభుత్వం మొక్కలు అందిస్తోందని ఉపాధి ఏపీవో లావణ్యకుమారి తెలిపారు. తొండూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు మామిడి, చీనీ, నిమ్మ, జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, తదితర పండ్లమొక్కలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించి ఉపాధిహామీ జాబ్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్సు కాపీలు అందించి పండ్ల మొక్కలను నాటుకోవాలని ఆమె కోరారు.

# క్విట్ కార్పొరేట్ నిరసనను జయప్రదం చేయండి

**మైదుకూరు ఆగస్టు 7, ప్రభాతవార్త :**

కార్పొరేట్ శక్తులకు వ్యతిరేఖంగా జరుగు క్విట్ కార్పొరేట్ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యాదర్శి పోతిరెడ్డి భాస్కర్ పిలుపునిచ్చారు.స్థానిక ఆకుల కాంప్లెక్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం బ్రిటీష్ పాలనలో బానిస జీవితం గడిపామని నేడు కార్పొరేట్ శక్తుల చేతిలో బానిసలుగా బ్రతికే రోజులు దగ్గరలోనే ఉన్నాయి కావునా కార్పొరేట్ శక్తులను వ్యతిరేకిస్తూ,ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కొసం భారతదేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో జరుగు క్విట్ కార్పొరేట్ అనే నినాదంతో జరుగు నిరసన కార్యక్రమంలో సంయుక్త కిషాన్ మోర్చా,వామపక్ష కార్మిక,వ్యవసాయ కార్మిక సంఘాల జాతీయ సమితుల పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో జరుగు నిరసన కార్యక్రమంలో రైతులు,కార్మికులు,వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గోని నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

# ఎన్‌డీఏ ముస్లిం జేఏసీ ఏర్పాటు

**- రాష్ట్ర అధ్యక్షులుగా సయ్యద్ ఖలీఫాతుల్లా బాషా ఏకగ్రీవ ఎన్నిక**




**కడప కార్పొరేషన్, ఆగస్టు 7, ప్రభాతవార్త:**

గత జగన్ పాలనలో ముస్లింలకు సంక్షేమ పథకాలు ఇవ్వలేదని మాజీ మేయర్ బి.ఆరీఫుల్లా విమర్శించారు. బుధవారం విజయవాడ హోటల్ ఐలాపురంలో ఎన్డీఏ కూటమి రాష్ట్ర స్థాయి ముస్లిం నాయకుల సమావేశంలో ఎన్డీఏ ముస్లిం జేఏసీ ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షులుగా సయ్యద్ ఖలీఫాతుల్లా బాషా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆరీఫుల్లా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 2019లో ముస్లింల కోసం పథకాలకు ఇస్తానని వాగ్దానం చేసి ఉన్న పథకాలు కూడా తీసివేసి ముస్లింలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. విద్య, వైద్యం, యువతకు మహిళలకు సంబంధించిన అభివృద్ధి పథకాలు ఇవ్వకపోగా తాను ఇస్తానన్న పథకాలు కూడా ఇవ్వలేదన్నారు. ఎక్కడా లేని నిబంధనలు పెట్టడం, ముస్లింలకు అరచేతిలో వైకుంఠం చూపించారని మండిపడ్డారు. 2024లో జరిగిన ఎన్నికల్లో వైసీపీకి ముస్లింలు గుణపాఠం చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ జనసేన కూటమిగా ఏర్పడి అత్యధిక ఆధిక్యంతో ఎన్డీఏ విజయం సాధించిందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ పార్టీలకు అనుబంధంగా వారు చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్తూ ఎన్డీఏ కూటమి 2024 ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని స్నేహపూర్వక వాతావరణంలో సాధించుకుంటుందని త్వరలో ఎన్‌డీఏ కూటమి నియమిస్తున్న నామినేటెడ్ పదవులు జనాభా ప్రాతిపదికన పార్టీలలో సభ్యత్వం కలిగి పార్టీల గెలుపు కోసం మైనార్టీ శాఖలో అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకు, నాయకులను విస్మరించకుండా వారికే పదవులు ఇవ్వాలని, పార్టీకి సంబంధం లేని సంస్థల వారు సూచించే వారికి కాకుండా పార్టీని నమ్ముకొని పార్టీ కోసం పనిచేసిన వారికి ఇవ్వాలని ఇండియన్ ముస్లిం జాబ్ డిమాండ్ చేయడమే కాకుండా త్వరలో ఎన్‌డీఏ పార్టీల కూటమి అధిష్టానాయకులతో కలిసి చర్చించి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్ జాకీర్ హుసేన్, షేక్ ఇమాంబాషా, అలీఅహ్మద్, షేక్ రఫీ, షేక్ తాజుద్దీన్, ఆయూబ్‌ఖాన్, ఆరీఫుల్లా, ఎండీ ఫజల్, ఎండీ సాజిద్, మౌలాబేగ్, నజీర్, ఖయ్యూం, మీర్జా బాబు తదితరులు పాల్గొన్నారు.

# సుండుపల్లి తహసీల్దారు పదవీ బాధ్యతలు చేపట్టిన దైవాదీనం

**సుండుపల్లె, ఆగస్టు 7, ప్రభాతవార్త:**

సుండుపల్లె తహసీల్దారుగా దైవాదీనం బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గాలివీడు మండలం తహసీల్దారుగా పనిచేస్తూ బదిలీపై సుండుపల్లె తహసీల్దారుగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దారు దైవాదీనం మండలంలోని అక్రమాలకు గురైన ప్రభుత్వ భూమిని ఇసుక మట్టి, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ఆర్ఐలు, వీఆర్వోలు రవి, బసయ్య, నరసింహులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొని తహసీల్దారుకు శుభాకాంక్షలు తెలిపారు.

# దళితుల భూములను ఆక్రమించేందుకు కుట్రలు

**- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ**

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 7, ప్రభాతవార్త:**



జిల్లాలోని దళితుల భూములను అగ్రవర్ణాల వారు అన్యాక్రాంతం చేయడం తగదని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ అన్నారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బద్వేలు తాలూకా బి.మఠం మండల పరిధిలో ఉన్న రేకుల కుంట గ్రామంలో సర్వే నంబరు 503/ఎలో బద్వేలుకు చెందిన బింగి ఓబులేసుకు ఆయన భార్య మౌలికకు 4 ఎకరాల భూమిని జీవనోపాధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే ఆ భూమిని కబ్జా చేసేందుకు బద్వేలు పట్టణానికి చెందిన పోకల మల్లేశ్వరరెడ్డి, అంబవరం సుబ్బారెడ్డి అనే వ్యక్తులు ఓబులేసుకు చెందిన భూమిని కబ్జా చేసేందుకు దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. వారి మీద ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం జరిగిందని చెప్పారు. అయినా వారు ఆ భూమిలోకి రాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. అగ్రవర్ణాల వారు ఎస్సీ, ఎస్టీల భూముల్లోకి రాకుండా జేసీ సాయి అధికారి చేత సమగ్ర విచారణ జరిపించి ఓబులేసు, మౌనికలకు న్యాయం చేయాలని వీరయ్య మాదిగ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, వెంకట నారాయణ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం

**కడప వైద్యవిభాగం, ఆగస్టు 7, ప్రభాతవార్త:**



గుంటూరులో అఖిల భారత కాపు సంఘం మరియు కాపు జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అలాగే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి బలిజ, కాపు తెలగ ఒంటరి, మున్నూరు, కాపు తూర్పు కాపు నాయకులు పెద్దఎత్తున పాల్గొని జాతిని ఉద్దేశించి మాట్లాడారు. జేఏసీ ఛైర్మన్ అమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభకు హాజరైన వారికి మెమెంటోలు ఇచ్చా శాలువాలతో సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నంశెట్టి మురళీకృష్ణను ఘనంగా సన్మానించి కాపు కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని ఇవ్వాలని సభకు వచ్చిన అన్ని రాష్ట్రాల వారు ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. అలాగే రాయలసీమ మీడియా ఇన్‌ఛార్జి శ్రీకాంత్‌ను, కడప జిల్లా బలిజ సంఘం అధ్యక్షులు బండి ప్రతాప్‌ను మెమెంటోలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# తల్లిపాలకు సాటి మరేది రాదు

**- తల్లిపాల ముగింపు వారోత్సవాలలో సీడీపీవో రాజేశ్వరి**

**చిట్వేలి, ఆగస్టు 7, ప్రభాతవార్త:**



తల్లిపాలతోనే ప్రతి బిడ్డ సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, తల్లిపాలకు సాటి మరేది రాదని చిట్వేలి ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీవవో రాజేశ్వరి పేర్కొన్నారు. సోమవారం వర్కర్లు, సిబ్బందితో ప్రధాన వీధుల్లో తల్లిపాల ప్రాముఖ్యతను గురించి నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీతో వారోత్సవాలను ఘనంగా ముగించారు. సీడీపీవో మాట్లాడుతూ బిడ్డ ఎదుగుదలలో తల్లిపాలు కీలకమన్నారు. అంతరాలను పూరిద్దాం.. తల్లిపాలను ప్రోత్సహిద్దాం, డబ్ల్యూహెచ్ఓ యూనిసెఫ్‌ల నినాదంతో ఈ ఏడాది చిట్వేలి ప్రాజెక్టు పరిధిలోని అన్ని పంచాయతీలలో అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వామ్యం చేసి అవగాహన కల్పించామన్నారు. ప్రతి వంద మందిలో 40 మంది తల్లులు మాత్రమే పిల్లలకు తల్లిపాలు ఇస్తున్నారని, ఈ దురదృష్ట పరిస్థితిని అధికమించి రొమ్ము, గర్భకోశ క్యాన్సర్ల లాంటి జబ్బుల నుంచి ప్రతి తల్లి రక్షణ పొందాలన్నారు. ప్రతి తల్లికి పౌష్టికాహారం, సరైన విశ్రాంతి కల్పించడం కుటుంబ సభ్యుల బాధ్యతన్నారు. తల్లి బిడ్డల సంరక్షణలో ఐసీడీఎస్ ముందు వరసలో ఉంటుందన్నారు. రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఐసీడీఎస్ వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసి బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు లాంటి దురాచారాలపై విస్తృతంగా కాలేజీలు, హైస్కూళ్లలో, కేజీబీవీఎస్‌లో అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇప్పటికే ప్రతి నెలా మొదటి బుధవారం, మూడో బుధవారం సామాజిక వేడుకలను అంగన్‌వాడీ కకేంద్రాలలో నిర్వహిస్తున్నామని, ఈ వేడుకల్లో సామాజిక భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-1 సూపర్‌వైజర్లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖ రాణి, టైపిస్ట్ హరీష్, మండల ప్రాజెక్టులోని 144 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

# 11న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవి ప్రతిష్ఠ దినోత్సవము

**ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 07, ప్రభాతవార్త:**



స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి దేవస్థానం(అమ్మవారి శాల)లో ఈనెల 11వ తేది ఆదివారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ప్రతిష్ఠా దినోత్సవం నిర్వహిస్తున్నామని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన రావు, కార్యదర్శి మురికి నాగేశ్వర రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 5:30గంటలకు సుప్రభాత సేవ, మంగళహారతి, 7గంటలకు శ్రీగణపతి, రుద్ర, నవగ్రహ, చండీ హోమము, పూర్ణాహుతీ, 12 గంటలకు అవభృదస్నానము, మరియు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి వజ్ర కిరీటము మరియు డైమండ్ శారీతో భక్తులకు దర్శణం ఇచ్చునట్లు తెలిపారు. మహా మంగళహారతి తదుపరి ప్రసాదవినియోగము జరుగుతుందని వివరించారు. కావున భక్తులు పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

# మండలంలో ఒక మోస్తారు వర్షం

**దువ్వూరు, ఆగస్టు 07, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులోనూ చుట్టుప్రక్కల గ్రామాల్లోనూ మంగళవారం రాత్రి ఒక మోస్తారు వర్షం కురిసింది. దువ్వూరు మండలంలో 44. 2మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. గత 40 రోజులుగా దువ్వూరు మండలంలో వర్షాలు లేకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. అలాగే గ్రామాలలో నీటి సమస్య కూడ ఉండేది. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో వంకలు, వాగులు స్వల్పంగా ప్రవహించాయి. వర్షంతో పాటు తెలుగంగ, కేసీ కాలువకు నీరు రావడంతో వరి నారుమల్లు సాగు చేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. గత 40రోజులుగ వర్షం లేక ఇబ్బంది పడ్డ రైతులు ఇప్పుడు పడిన వర్షం ఊరట లభించిందని చెప్పవచ్చు..

# ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా వర్షాలు

**అత్యధికంగా బి.మఠం 7సెంటీమీటర్లు, పెనగలూరు 6.6సెంటిమీటర్లు**

**రాజంపేట అర్బన్, ఆగస్టు 07, ప్రభాతవార్త:**

నైరుతీ రుతుపవణాల ప్రభావంతో ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా పెనగలూరులో 66.6మిల్లీ మీటర్లు, కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో 69.2మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే రాజంపేట 41.8మిల్లీ మీటర్లు, పుల్లంపేట 45.2, గాలివీడు 16.6, చిన్నమండెం 25, సంబెపల్లె 18.6, లక్కిరెడ్డిపల్లె 28, పి.సుండుపల్లె 18.6, రామాపురం 18, వీరబల్లె 13,2, నందలూరు 28.6, చిట్వేలి 14, ఓబులవారిపల్లె 10.2, కోడూరు 13.2, పెద్దమండెం 26.6, రామసముద్రం 20 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. కడప జిల్లాలో ఖాజీపేట 41,4మిల్లీ మీటర్లు,కమళాపురం 19.4, చెన్నూరు 29.8, ఒంటిమిట్ట 42.2, సిద్ధవటం 30.2, కడప 45.4, చింతకొమ్మదిన్నె 52.4, మైదుకూరు 23, కాశినాయన 19.2, కలసపాడు 12.6, పోరుమామిళ్ల 65.2, బి.కోడూరు 39.6, బద్వేల్ 48.4, గోపవరం 34.6, అట్లూరు 38.8, మైలవరం 13.4, రాజుపాళెం 54.6, దువ్వూరు 44.2, చాపాడు 26.2, ప్రొద్దుటూరు 41, జమ్మలమడుగు 32.4, ముద్దనూరు 14.2, యర్రగుంట్ల 44, తొండూరు 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**రాజంపేట, ఆగష్టు07, ప్రభాతవవార్త :**



నేషనల్ హైవే 716 గుంతలు, వాహనాల రద్దీ కారణంగా ప్రమాదాలు సర్వసాధారణం అయిపోయాయి. కాగా మండలంలోని మంగంపేట కు సంబంధించిన బారీ టన్నేజి లారీలు అనుని త్యం ప్రయాణించడం వలన రహదారులు చాలా వరకు దెబ్బతిన్నాయి. దీని వాలన అనునిత్యం ప్రమాదాలఉ చోటు చేసుకుంటున్నాయి. కాగా బుధవారం ఉదయం 8.30 గంటలకు మాధవరం పోడు గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ రెడ్డి (23) అనే వ్యక్తి గుంతల కారణం చేత అదుపుతప్పి కేఏ563722 అనే నెంబర్ గల లరీ నిఢీ కొనడంతో అక్కడి కక్కడే మరణించాడు. పోలీసులు అక్కడికి చేరుకుని కోడూరు ప్రభుత్వాసుపత్రికి 108 వాహనం ద్వారా తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ముర్రుపాలు బిడ్డకు శ్రేయస్కరం

**మైదుకూరు ఆగష్టు 7, ప్రభాతవార్త :**

బిడ్డ పుట్టిన వేంటనే తల్లి ముర్రుపాలు పట్టడం శ్రేయస్కరమని,అలాగే చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని 10వ వార్డు సచివాలయ మహిళా పోలీసు కే.సునంద అన్నారు. బధవారం మైదుకూరులోని వెంకట సుబ్బయ్య కాలనీ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో తల్లులకు, తల్లిపాల యొక్క అవశ్యకతను వివరించారు.తల్లుల పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అలాగే మహిళలకు దేశంలో ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహితపై అవగాన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమాదేవి,అంగన్వాడి కార్యకర్త సమతీ పిల్లల తల్లులు పాల్గొన్నారు.



## 200 హెల్మెట్లు ఉచిత పంపిణీ



కడప కార్పొరేషన్, ఆగస్టు 7, ప్రభాతవార్త:

జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవా సంస్థ, ఫ్యాక్టరీల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పులివెందులకు చెందిన ఆదిత్య బిర్లా గార్మెంట్స్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ 200 హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు జిల్లా జడ్జీ, కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జీ శ్రీదేవి, జిల్లా కలెక్టర్ శివ శంకర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్, మరియు కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జిల్లా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మీరా ప్రసాద్ పాల్గొన్నారు.

## పెండ్లిమర్రి తహసీల్దారుగా అనురాధ

పెండ్లిమర్రి, ఆగస్టు 7, ప్రభాతవార్త:



పెండ్లిమర్రి తహసీల్దారుగా బుధవారం అనురాధ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలుంటే పరిష్కరిస్తామన్నారు. ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. రెవెన్యూ సంబంధ వాటి పట్ల పటిష్ట భద్రత కల్పిస్తామన్నారు. కౌలు రైతులు కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## తల్లిపాల కమ్మనం..
## భాషా సాహిత్య లక్ష్యం సామాజిక ప్రయోజనమే



కలికిరి, ఆగస్టు 7, ప్రభాతవార్త:

తల్లి భాష కమ్మదనాన్ని నుడికారాన్ని ఔన్నత్యాన్ని ఈ తరానికి నేర్పించకపోతే మనం భాషా ప్రియులం కాలేమని స్టూడెంట్స్ ఇండెక్షన్ కార్యక్రమం సందర్భంగా కలికిరి జేఎన్‌టీయూలో బుధవారం వైస్ ప్రిన్సిపల్ డా.ఎన్.త్యాగరాజన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధికార భాషా సంఘం ఎస్వీ యూనివర్శిటీ పాలక మండలి పూర్వ సభ్యుడు కవి డా.వేంపల్లె అబ్దుల్ ఖాదర్ అన్నారు. అనంతరం డా.రాజేంద్రప్రసాద్, అబ్దుల్ ఖాదర్‌లు విద్యార్థులు బాల్యదశ నుంచే మానవ సంబంధాలు, మానవవీయ విలువలు కలిగి ఉండాలని తెలిపారు. సామాజిక సేవలో పాలుపంచుకునే వారే వినయం, విధేయత వంటి ప్రవర్తనా నియమావళి కలిగి ఉంటారని గుర్తు చేశారు. ఫ్రెషర్స్ పాల్గొన్న ఈ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. డా.ఎన్.సరిత, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఎండిఓ కార్యాలయంలో శిక్షణ

మదనపల్లె, ఆగస్టు 7 ప్రభాతవార్త :

ఆర్‌జిఎస్ఎ స్కీమ్ కింద ఏపిఎస్ఐఆర్‌డిపిఆర్ వారి ఆధ్వర్యంలో 8నుంచి 10వ తేది వరకు మూడు రోజులు పాటు సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఓ భానుప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. శానిటేషన్, ఎస్‌డబ్ల్యుపిసి, జిపిడిపిలపై శిక్షణ ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10గంటల నుంచిసాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. సర్పంచ్‌లు అందరూ తప్పక హాజరు కావాలన్నారు.

## మందక్రిష్ణ ర్యాలీని జయప్రదం చేయండి




మదనపల్లె, ఆగస్టు 7 ప్రభాతవార్త :

హైదరాబాద్‌లో ఈనెల 13న జరిగే మందక్రిష్ణ మాదిగ స్వాగత ర్యాలీని జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస రావు మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సామాజిక ఉద్యమాల చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖించిందన్నారు. మందక్రిష్ణ మాదిగ పోరాట ఉద్యమంతోనే ఈ వర్గీకరణ సాధ్యం అయ్యిందన్నారు. తొలిసారిగా ఆయన హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా స్వాగత ర్యాలీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమలో ఎంఎస్‌పి జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ,జీవి.రమణ, శీనూ, గంగాధర్, రవి, విజయభాస్కర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## మాంసపు విక్రయదుకాణాల్లో
## పరిశుభ్రత పాటించాలి



రామసముద్రం, ఆగస్టు 7 ప్రభాతవార్త :

మండలంలోని మేజర్ పంచాయితీ చెంబకూరులో మాంసము విక్రయించే దుకాణాలు నిర్వహించే దుకాణదారులకు తమ దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే మాంసపు వ్యవర్థాలను జనసంచార ప్రదేశాలలో వేయరాదని పంచాయితీ కార్యదర్శి మునస్వామినాయక్ దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. అలాగే మాంసంపై ఈగలు వాలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ప్రొపెసర్‌కు డాక్టరేట్

కురబలకోట, ఆగస్టు 7 ప్రభాతవార్త :



మిట్స్ కళాశాలకుచెందిన అసిస్టెంట్ ప్రొపెసర్ జగన్నాథ్ పట్టార్‌కు డాక్టరేట్ ప్రధానంచేశారు. ఈయనకు కర్నాటకాలోని తుంబకూరులోని శ్రీ సిద్దార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ యూనివర్శిటి పిహెచ్‌డి పట్టా ప్రధానంచేసిందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. మెకానికల్ రంగంలో ట్రైబాలాజికల్ ప్రాపెర్టీస్, మైక్రోస్ట్రక్చర్ క్యారిక్టరైజేషన్‌లపై పరిశోదనలు చేసినందుకు డాక్టరేట్‌ను ఆయనకు లబించినట్లు తెలిపారు. జగన్నాద్‌ను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.విజయ భాస్కర్‌చౌదరి, ఈడి కీర్తినాదేళ్ళలు అభినందించారు.

# స్వాతంత్ర్య దినోత్సవాన్ని పండగలా చేద్దాం

మదనపల్లె, ఆగస్టు 7 ప్రభాతవార్త:



స్వాతంత్ర్యదినోత్సవాన్ని ఓ పండగలా చేద్దామంటూ బిజెపి రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్‌లు తెలిపారు. బుధవారం బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మూడు రోజులు పాటు స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను వైభవంగా నిర్వహిద్దామన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. వికసత్ భారత్‌లో భాగంగా 2047కు దేశం ప్రపంచంలోనే అన్నివిదాల, అభివృద్దిలో అగ్రస్థానంలో ఉండాలన్నారు. ప్రతి పౌరుడు జాతీయజెండాను ఎగురవేయాలన్నారు. దేశం పట్ల భక్తిభావం కలిగి ఉండాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి ఒక్కరిచేత జాతీయ జెండా ఉండాలని అదే విధంగా విద్యార్థులచేత జెండా చేతపట్టి భక్తిభావాన్ని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి బిజెపినాయకులు గ్రామ, మండలస్థాయిలో కార్యకర్తలకు అవగాహన కల్పించి ఒకొక్క బూత్ స్థాయిలో వంద జెండాలు ఎగిరేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి పార్లమెంటరీ కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, ఆకుల క్రిష్ణమూర్తి, పట్టణ అధ్యక్షులుభర్నేపల్లి రవికుమార్, ఒసూరి కిరణ్, పిల్లస్వామి నాయక్, భువనేశ్వరీసత్యా తదితరులు పాల్గొన్నారు.

## బాధిత రైతులకు
## నష్టపరిహారం మంజూరు చేయాలి



కురబలకోట, ఆగస్టు 7 ప్రభాతవార్త :

మండలంలోని దిగువశీతివారిపల్లె వద్ద తెగిన చెరువులను తంబళ్లపల్లె టిడిపి ఇన్‌చార్జ్ దాసరపల్లె జయచంద్రారెడ్డి బుధవారం పరిశీలించారు. పిచ్చలవాండ్లపల్లె పంచాయితీ దిగువశీతిపల్లెవారిపల్లె చెరువుకట్ట ఇటీవల కురిసిన వర్షానికి చెరువుకు గండిపడడంతో సుమారు వంద ఎకరాల సాగు నీరు వృధాగా పోయిందన్నారు. దీంతో ఆయుకట్టరైతులకు ఆర్థికంగా నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. గతంలో ముదివేడు రిజర్వాయర్ నిర్మాణానికి ఈ చెరువులో మట్టిని కాంట్రాక్టర్ తరలించడంత చెరువుగట్టు దెబ్బతినిందని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి రైతులకు నష్టపరిహారం మంజూరు అయ్యేలా కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. చెరువు నిర్మాణం యుద్ధప్రాతిపదికన జరిగేలా సిఎం చంద్రబాబు, జిల్లా మంత్రి మండపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. ఈయన వెంట సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, కన్వీనర్‌వైజి సురేంద్రయాదవ్, నాయకులు డిఆర్.వెంకటరమణారెడ్డి, మైనార్టీ అయూబ్, పిచ్చలవాండ్లపల్లె సర్పంచ్ సురేంద్ర, మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## దస్త్రాలు, పౌరసరఫరాల గోదామ్‌ను పరిశీలించిన జేసి



కురబలకోట, ఆగస్టు 7 ప్రభాతవార్త :

అన్నమయ్యజిల్లాసంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర బుధవారం సాయంత్రం కురబలకోట తహశీల్దార్‌కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దస్త్రాలున్న గదిని ఆయన పరిశీలించారు. అన్ని రకాల దస్త్రాలను పద్బదీంగా భద్రపరచాలన్నారు. అనంతరం సిబ్బందితో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రికార్డులను పరిశీలించి వివిధ అంశాలపై ఆదేశాలు జారీచేశారు. అనంతరం మదనపల్లెలోని పౌరసరఫరాలశాఖ మండల స్థాయి గోదామ్‌ను తనిఖీచేశారు. సరుకుల నాణ్యతను పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట సివిల్‌సప్లై జిల్లామేనేజర్ శివరామ్, మదనపల్లె తహశీల్దార్, గోడౌన్ డిటిలు నవీన్, ఆర్ఐ సుగుణ, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

## శ్రీరాముల ఊరేగింపు

రామసముద్రం, ఆగస్టు 7 ప్రభాతవార్త :

మండల కేంద్రంలో శ్రీరామకోటి సప్త మహోత్సవంలో భాగంగా చివరిరోజు మండలంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీరాములు కోలాట చెక్కభజనలతో పురవీధుల్లో ఊరేగించారు. ఈకార్యక్రమంలో భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయంలో క్రీడలు ప్రారంభం



మదనపల్లె, ఆగస్టు 7 ప్రభాతవార్త :

మదనపల్లె మండలం వలసపల్లెలోని నవోదయ విద్యాలయంలో క్లస్టర్ అథ్లెటిక్‌క్రీడలను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ బి.గోవింద్‌రావ్ క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. 9జిల్లాలకు చెందిన నవోదయాలనుంచి వచ్చిన అథ్లెట్స్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.వేలాయుధన్, వ్యాయామ ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, కోతాయి సిబ్బంది పాల్గొన్నారు.

## కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

మదనపల్లె, ఆగస్టు 7 ప్రభాతవార్త :

భూకబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మదనపల్లె డిఎస్‌పి దర్బార్ కొండయ్యనాయుడు హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో గంజాయి, ర్యాష్‌డ్రైవింగ్, మత్తుపదార్థాలు, భూ ఆక్రమణలు వంటి ఆక్రమాలకుపాల్పడితే ఎవరిని వదలమని కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణంలో భాగంగా డిఎస్‌పిచే పలువురు విలేకర్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో సిగరేట్లు, మత్తుపదార్తాలు కనపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



## అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ



బి.కొత్తకోట, ఆగస్టు 7 ప్రభాతవార్త :

మండలంలోని కాండ్లమడుగు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రంలోని ఉపాధ్యాయురాలిని పిల్లలందరూ సమయానికి వస్తున్నారా అని విచారించారు. సమయానికి భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. సిబ్బంది హాజరు రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. పిల్లలకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తదితరుల పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల
## సంఘాలకు ఉజ్వల భవిష్యత్తు



పీలేరు, ఆగస్టు 07 ప్రభాతవార్తః

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు భవిష్యత్తు ఉందని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక వెంకటేశ్వరస్వామి కళ్యాణమండపంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఉద్యానశాఖ సహకారంతో పీలేరు వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ ఆరవ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని అభివద్ది చేయడంతో పాటు దానిలోని సంక్షోభాలను ఎదుర్కొనడానికి ప్రభుత్వం రైతులను ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత రైతులు పెద్ద ఎత్తున ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి అభివద్ది చెందాలని కోరారు. ఉత్పత్తిదారుల సంఘాలకు తమ శాఖ ద్వారా ప్రభుత్వం కలెక్షన్ సెంటర్ కోల్డ్ స్టోరేజీ ప్యాక్‌హౌస్, పాలీహౌస్, నర్సరీ షెడ్నెట్ తదితర సదుపాయాలు సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే పీఎంఎఫ్ఎంఈ పథకం కింద విలువ ఆధారిత ఉత్పత్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో కూడిన పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడుతున్నాయని అన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ గుణశేఖర్ పిళ్లై మాట్లాడుతూ తమ శాఖ ద్వారా పశు కిసాన్ క్రెడిట్ కార్డు, పశుభీమా పథకం, గోకులం పథకం మరియు పీఎంఈజీపీ పథకాల గురించి రైతులకు వివరించారు. పట్టుపరిశ్రమ శాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తమశాఖ ద్వారా పట్టు పరిశ్రమలను ఏర్పాటుచేసే ఔత్సాహిక రైతులకు సబ్సిడీతో కూడిన పథకాన్ని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రకతి వ్యవసాయాన్ని పనులు బోదేషావలి ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడి పంటను ప్రకతి వ్యవసాయ పద్దతిలో ఇతర ఉద్యాన వ్యవసాయ పంటలను పండించినట్లయితే మార్కెట్‌లో అదిక ధరలకు కొనుగోలు చేయడానికి అనేక మంది వ్యాపారస్తులు ఎగుమతి దారులు ఉన్నారని కావున రైతులు ప్రకతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సుకుమార్, మత్స్యశాఖ అధికారి మోహన్‌కష్ణ, పట్టు పరిశ్రమ శాఖ అదికారి నాగేశ్వరరెడ్డి, హెచ్ఈఓ దరహాస, డీఆర్పీ మహేష్, ప్రాజెక్టు మేనేజరు భార్గవి సీఈఓ ప్రత్యూష, పూజిత రైతులు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా
## - చదువుకు దగ్గరగా ఉండాలి

పీలేరు, ఆగస్టు 07 ప్రభాతవార్తః

స్థానిక వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రహరీక్లబ్‌ని వాల్మీకిపురం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పులిశేఖర్‌గారు ప్రారంభించారు. ఈసందర్భంగా పులిశేఖర్ మాట్లాడుతూ పాఠశాలలో ప్రహరీ క్లబ్‌ని ఏర్పాటుచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈక్లబ్ ద్వారా విద్యార్థులలో మాదక ద్రవ్యాల వినియోగం దుష్పరిణామాలు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. విద్యార్థులు చదువుకు దగ్గరగా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తద్వారా ఉన్నత విలువలు అలవడుతాయని అన్నారు. బాల్య వివాహాలను అరికట్టడం బాలల హక్కులు చైల్డ్ అబ్యూస్, ఫోక్సో చట్టం గురించి వివరించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా 100కి చైల్డ్ లైన్ నెంబరు 1098కి డయల్‌చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మండల విద్యాశాఖాధికారి వెంకటరత్నం, హెచ్ఎం సావిత్రి క్లబ్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రమణప్ప, నాగేశ్వర, నాగరాజ వసుమతి, కల్పలత, సుజాత, శేఖర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.




## వీధికుక్కల నుండి రక్షించండి

గాలివీడు, ఆగస్టు 7, ప్రభాతవార్త:



వీధికుక్కల దాడుల నుండి రక్షించండి అంటూ గ్రామస్తులు కోరుతున్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ భాగ్యలత, ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాన రహదారులపై సంచరిస్తున్న చిన్నపిల్లలు, విద్యార్థులు, పాదచారులపై వీధికుక్కలు ఆకస్మాత్తుగా దాడి చేసి గాయపరుస్తున్నాయంటూ విచారం వ్యక్తం చేశారు. అక్కడితో ఆగక ద్విచక్రవాహనదారులను వెంబడించడంతో ప్రమాదాలకు కారణమౌతున్నాయన్నారు. గతంలో కూడా వీధికుక్కల దాడిలో పలువురు గాయాలతో ఆసుపత్రి పాలయ్యారని గుర్తుకు చేశారు. వెంటనే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి వీధికుక్కలను పట్టి తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనంద్‌కుమార్, చెన్నయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రైల్వేకోడూరు, ఆగష్టు 7, ప్రభాతవార్త:



రైల్వేకోడూరు మండలంలోని మైసూరా వారి పల్లి పంచాయతీ రాజా నగర్ నందు బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కిరణ్ కుమార్ రెడ్డి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. బుధవారం ఉదయం స్కూల్లో పిల్లలను వదిలి తిరిగి మాధవరంపోడుకు వెళుతున్న సందర్భంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో కిరణ్‌కుమార్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గత రెండు రోజుల క్రితమే మృతుడు కువైట్ నుండి మాధవరం పోడుకు వచ్చినట్లు మృతుడి బంధువులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న వైసీపీ నాయకులు కొల్లం గంగిరెడ్డి,వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిలు మృతుడి కుటుంబాన్ని పరామ్శించారు అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆటో ఓనర్స్ వర్కర్స్ యూనియన్ ప్రారంభం

రైల్వేకోడూరు, ఆగష్టు 7, ప్రభాతవార్త:



రైల్వేకోడూరు పట్టణంలోని ఆర్ ఎస్ రోడ్డు నందు బుధవారం ఆటో ఓనర్స్ వర్కర్స్ యూనియన్‌ను రైల్వేకోడూరు సిఐ టి బాబు, ఎస్సై డాక్టర్ నాయక్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆటో డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం మత్తులో వాహనాలను నడపరాదని వారు వారికి సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయాలలో అజ్ఞత వ్యక్తులకు ఆటోలు బాడుకకు ఇవ్వద్దని అటువంటి వారిపై కేసులు నమోదు చేసే ఆస్కారం కూడా ఉందని వారు తెలిపారు. ముఖ్యంగా వాహనదారులు పూర్తిస్థాయిలో బాధ్యతగా ఆటోలను తోలాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయ్, పలువురు ఆటో ఒనర్లు పాల్గొన్నారు.

## చిన్నమండెం తహశీల్దార్‌గా నరసింహులు

చిన్నమండెం, ఆగస్టు 7, ప్రభాతవార్త :



చిన్నమండెం మండల తహశీల్దార్‌గా సి. నరసింహులు బుధవారం బాధ్యతలు తీసుకొన్నారు. ఆయన గతంలో సంబేపల్లె మండల తహశీల్దార్‌గా వున్నారు. ప్రస్తుతం నాగలాపురంలో ఎన్నికల బాధ్యతలు అనంతరం బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మండల రెవెన్యూ కార్యాలయంలో మాట్లాడుతూ చట్ట పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బందితో కలిసి సేవలు అందిజేస్తామని ఆయన అన్నారు.

## గాలివీడు తహసీల్దార్‌గా భాగ్యలత

గాలివీడు, ఆగస్టు 7(ప్రభాతవార్త):



మండల నూతన తహసీల్దార్‌గా జె.భాగ్యలతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అన్నమయ్య జిల్లా కలికరి మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆమె ఎన్నికల అనంతరం బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల్లో అలసత్వం లేకుండా పనిచేస్తామని స్పష్టం చేశారు. రెవెన్యూ పరంగా ఎలాంటి సమస్యలున్నా సిబ్బందితో కలిసి సమన్వయంతో ప్రజా సమ్యలు, రైతుల భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## టుటౌన్ సీఐగా యుగంధర్

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 7, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు టుటౌన్ సీఐగా యుగంధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మంచితనానికి మారుపేరుగా పనిచేస్తూ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సన్నిహితంగా విధులు నిర్వహిస్తున్న సీఐకి ధన్యవాదాలంటూ పలువురు ప్రజలు పేర్కొన్నారు.

## ఎన్ఎంయూఏ సర్వసభ్య సమావేశం

జమ్మలమడుగు, ఆగస్టు 7, ప్రభాతవార్త:



జమ్మలమడుగులోని శ్రీచక్ర ఫంక్షన్ హాలులో బ్రహ్మం అధ్యక్షతన ఎన్ఎంయూఏ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు పి.వి.శివారెడ్డి, కడప రీజనల్ కార్యదర్శి సుధాకర్‌లు హాజరయ్యారు. జమ్మలమడుగు డిపో ఎన్ఎంయూఏ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జమ్మలమడుగు డిపో మేనేజర్, అసిస్టెంట్ డిపో మేనేజర్, గ్యారేజీ ఏఎంఎఫ్‌లు డిపోలో అనవసరంగా సమస్యలను సృష్టిస్తున్నారని డ్రైవరు సోదరులకు ఎటువంటి ఇంటిమేషన్ ఇవ్వకుండా డ్యామేజీ రికవరీ చేస్తున్నారన తెలిపారు. డ్యూటీలను కూడా ఇష్టానుసారంగా వేయడం జరుగుతోందన్నారు. కడప డీపీటీఓ ఏ ఒక్క సమస్యను పరిష్కరించడం లేదని ఇలాగే కొనసాగితే కడప రీజియన్‌లో ఉన్న అన్ని డిపోల పరిధిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశానికి డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీసీఓ రెడ్డి, డిపో కార్యదర్శి శివుడు, నాగేంద్ర, సీసీఎస్ డెలికేట్ కాంతయ్య, గ్యారేజీ కార్యదర్శి మరియు అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## జమ్మలమడుగు నూతన డీఎస్పీగా హుసేన్ పీరా

జమ్మలమడుగు, ఆగస్టు 7, ప్రభాతవార్త:



జమ్మలమడుగు పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో నూతన డీఎస్పీగా జి.హుసేన్ పీరాబుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పెనుగొండ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ అనంతపురం పోలీసు ట్రైనింగ్ కాలేజీలో డీఎస్పీగా బదిలీపై వెళ్లారని ప్రస్తుతం సార్వత్రికెన్నికల తరువాత సాధారణ బదిలీలలో భాగంగా జమ్మలమడుగు డీఎస్పీగా వచ్చినట్లు తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటామని తెలిపారు.

## జనసేన పార్టీ క్రియా శీల సభ్యత్వ నమోదు అమోఘం

జమ్మలమడుగు, ఆగస్టు 7, ప్రభాతవార్త:



జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం జమ్మలమడుగు నియోజకవర్గంలో అమోఘంగా నిర్వహించిన కీలక లక్ష్యాన్ని సాధించడం ఎంతో సంతోషంగా ఉందని జమ్మలమడుగు జనసేన పార్టీ కోఆర్డినేటర్ నాగార్జున పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ విడత జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదులో జమ్మలమడుగు నుంచి మొత్తం 1242 సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక మహా యజ్ఞంలో భావించి తానుసొంతంగా 600 పైగా సభ్యత్వాలను నమోదు చేశానన్నారు. ఈ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో తమ వంతుగా జనసైనికులు, వవీర మహిళలు సభ్యత్వ నమోదు కీలక పాత్ర పోషించారరన్నారు. భవిష్యత్తులో జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, జనసైనికులకు ఎలాంటి సమస్య వచ్చినా తాము ముందుండి పరిష్కరిస్తామన్నారు.

# సమస్యలపై ధ్వజమెత్తిన కౌన్సిలర్‌లు

– అధికారుల నిర్లక్ష్యం కారణంగా పరిష్కారం కాని సమస్యలు – వార్డులలో బ్లీచింగ్, ఫాగింగ్‌ల పిచికారి చేయడంపై నిర్లక్ష్యం

– మున్సిపాలిటీలోని స్థలాలను అధికారులు కాపాడాలి – ఎమ్మెల్యే సమక్షంలో సమస్యలు విన్నవించిన కౌన్సిలర్లు




బద్వేలు, ఆగస్టు 7 ప్రభాతవార్త :

మున్సిపాలిటీలో ఎక్కడి సమస్యలు అక్కడ తిష్టవేశాయని, వాటిని పరిష్కరించడంలో అధికారులు అలసత్వం చూపడం వలన వార్డులలో ప్రజలు మండిపడుతున్నారని కౌన్సిలర్లు సమావేశంలో ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వ సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే డాక్టర్ సుధ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించలేకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, దీని వలన వార్డులలో తిరగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారి, వర్షాకాలం వచ్చిందంటే రోడ్డుపైకి మురుగునీరు ప్రవహించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, దీనికితోడు ఎక్కడపడితే అక్కడ పందులు సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అవస్థలు పడుతుంటే వీటికితోడు పందులు సంచారంతో రోగాలు ప్రభలేఅవకాశం ఉందన్నరు. ముఖ్యంగా సీజనల్‌లో భాగంగా దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నరు. ఎక్కడ చూసినా దోమలు విపరీతంగా పెరిగిపోయాయని దీనికి కనీస పరిష్కారమైన బ్లీచింగ్, ఫాగింగ్ చేయడం లాంటి చర్యలు చేపట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. అలాగే అక్కడక్కడా విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయాలలో విషపురుగుల దాటికి ప్రజలు అవస్థలు పడతున్నారన్నారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి ఫాగింగ్ మిషన్లు తెచ్చి మూలన పడేస్తున్నారే గాని వాటిని ఉపయోగించడంలో అధికారులు విఫలమయ్యారని కౌన్సిలర్లు మండిపడుతున్నారన్నారు. అలాగే మున్సిపాలిటీలోని ప్రభుత్వ స్థలాలను కాపాడడంలో అధికారులు విఫలం కావడం వలన కబ్జాకు గురవుతున్నాయని, మహమ్మద్ కాలని చివరన ఉన్న కొండవద్ద మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాన్ని పార్కు ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని గుర్తిస్తేదానిని సైతం ఆక్రమించేందుకు వెనకాడడం లేదని కౌన్సిలర్లు సమావేశంలో తెలిపారు. లక్షల రూపాయలు వెచ్చించి మెయిన్ రోడ్లలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే వాటికి బ్యానర్లు కట్టి లైటింగ్ లేకుండా అడ్డుపడేలా చేస్తున్నారని, వాటిని తక్షణమే తొలగించి ప్రజలు, వాహనదారులకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. అలాగే మున్సిపాలిటీ స్థలంలో లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెట్రోలు బంక్ ఏర్పాటు చేస్తే ఇంతవరకు దానిని ప్రారంభించలేదని, వృధాగా ఉండడం వలన ఫలితం ఉండదని, తక్షణమే ప్రారంభించాలని కోరారు. చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సమావేశంలో కౌన్సిలర్లు విన్నవించిన సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరిస్తే సమస్యలుండవని, మరళా సమావేశం వరకు వాటిని పరిష్కరించలేకపోవడం వలన ఇబ్బందులు తప్పవని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలోని స్థలాలు కబ్జాకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ కౌన్సిలర్లకు ప్రతిపక్ష హోదా కల్పించాలని కోరారు.

# ఉచితంగా 1700 హెల్మెట్లు పంపిణీ




కడప లీగల్, ఆగస్టు 7, ప్రభాతవార్త:

కడప జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి విద్యార్థులకు, లెక్చరర్లకు, డిజేబుల్ పర్సన్లకు, పత్రికా విలేకరులకు న్యాయవాదులకు, న్యాయవాద క్లర్కులకు, పోలీసు వారికి, న్యాయశాఖ సిబ్బందికి, మహిళలకు, పారా లీగల్ వాలంటీర్లకు ప్యానల్ న్యాయవాదులకు మెడికల్ కళాశాల విద్యార్థులు, ప్రజలకు ఉచితంగా 1700 హెల్మెట్లు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి.ఎదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించండి.. సురక్షితంగా గమ్యాన్ని చేరండి అంటూ హెల్మెట్ ఉపయోగాలు వివరించారు. అలాగే 50 వీల్ ఛైర్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు ఆదిత్య బిర్లా, భారతి సిమెంట్స్, ఇండియా సిమెంట్స్, దాల్మియా సిమెంట్స్, హెచ్‌పీసీఎల్, జువారి, సంయుగాజు శతాబ్దపు ప్యాన్లు, షిర్డీ ఎలక్ట్రికల్స్, ఆర్టీపీపీ, డిక్సాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెద్దరంగాపురంలో ప్రారంభమైన ప్రతిష్ఠ మహోత్సవం





పులివెందుల, ఆగస్టు 7, ప్రభాతవార్త ః

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో శ్రీఅంకాళమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు అర్చకుల వెల్లాల సీతారామశర్మ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. మొదటిరోజు బుధవారం ఉదయం గణపూజతో పూజలు ప్రారంభమయ్యాయి. పుణ్యాహవాచనం, కంకణధారణ, ఋుత్విక్‌కరణ, పంచగవ్యప్రాసన, కలశస్థాపన, యంత్రాభిషేకం, మంత్రపుష్పం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అంకురారోపణం, నవగ్రహ ఆరాధన, అగ్నిప్రతిష్ఠ, దీక్షాహోమం, శ్రీసూక్తిహోమం, జలాదివాసం, మంత్రపుష్పం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులందరు పెద్దఎత్తున తరలివెళ్లి పుట్టమట్టిని దేవస్థానం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని యువకులందరు తమ హస్తాలతో ఎత్తుకుని దేవస్థానం వద్ద జలాధివాసం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలో పెద్దఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

**– నేడు గజ్జలపూజ ః** పెద్దరంగాపురం గ్రామంలో జరుగుతున్న శ్రీఅంకాళమ్మతల్లి ప్రతిష్ఠ మహోత్సవం సందర్భ:గా రెండోరోజు రాత్రి దేవస్థానం సమీపంలో గ్రామస్థులు సహాయ సహకారాలతో చెక్క భజన, గురువు సాంబశివుడు ఆధ్వర్యంలో గజ్జలపూజ కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామస్థులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని గ్రామస్థులు కోరారు.

## ప్రజలకు హానికరమైన కెమికల్ ఫ్యాక్టరీని తొలగించాలి

ముద్దనూరు, ఆగస్టు 07, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని పెద్దదుద్యాల గ్రామం నందు ఉన్న జిఎంఈసిఓ సర్వీసెస్ ఎల్‌ఎల్‌పి కెమికల్ ఫ్యాక్టరీ వలన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నారని, ప్రజలు అనారోగ్య పాలు అవుతున్నారని హానికరమైన కెమికల్ ఫ్యాక్టరీని ప్రభుత్వం, అధికారులు స్పందించి తొలగించాలని ప్రజల ప్రాణాలు కాపాడాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం నాడు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఇన్చార్జి ఆర్డీఓ శాంతమ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పెద్దదుద్యాల గ్రామం ప్రజలు హానికరమైన కెమికల్ ఫ్యాక్టరిని తొలగించాలని గత కొద్ది రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారని, ఈ కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలు, రసాయనాలు చుట్టుప్రక్కల రైతుల భూములు ఎండిపోతున్నాయని అక్కడి గ్రామ రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ప్రధానంగా ఈ కంపెనీ వ్యర్థ పదార్థాల వల్ల తయారు చేసే రసాయనాన్ని ఎర్రగుంట్ల దగ్గర ఉన్న భారతీ సిమెంట్ ఫ్యాక్టరికి తరలిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బలవంతంగా పెద్దదుద్యాల గ్రామంలో ప్రజలు వ్యతిరేకిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సిమెంట్ పరిశ్రమ కాబట్టి అప్పటి అధికారులు, గ్రామ ప్రజల మొర అరకించలేదు అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి హానికరమైన, ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కొంతమంది విష వాయువు కారణంగా రోగాలబారిన పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వం మారింది, అధికారులు మారారు ఇప్పటికైన పెద్ద దుద్యాల గ్రామ ప్రజల మొర ఆలకించాలని కోరారు. తక్షణమే ఫ్యాక్టరీని అక్కడి నుండి తొలగించి రైతుల ప్రాణాలు, రైతుల భూములు కాపాడాలని లేనిపక్షంలో డీవైఎఫ్ఐగా కలిసొచ్చే అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి మహేష్‌యాదవ్, నాయకులు ముని, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పశుగణనను పారదర్శకంగా నమోదు చేయాలి

పీలేరు, ఆగస్టు 07 ప్రభాతవార్తః




పశుగణనను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీలేరు నియోజకవర్గం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు 21వ అఖిల భారత పశుగణన 2024 పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమం సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గంలోని రైతు పేరుతో పాటు ఆవులు, గొర్రెలు, బర్రెలు, మేకలు, పందులు, పెంపుడు కుక్కలు తదితర జంతువులను 5 సంవత్సరాలకు ఒకసారి పశుగణన నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ మాలకొండయ్య, ఏడీఈలు డాక్టర్లు లోకేష్, విశ్వేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటముని నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పాటుచేసి

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలను ఆదుకోవాలి

ప్రొద్దుటూరు, ఆగస్టు 07, ప్రభాతవార్త:



రాష్ట్రంలోని చేనేతలు, కూలీలు, గిట్టుబాటు కాని ధరలతో పవర్ లూమ్స్ వలను అప్పులు పెరిగి ఆదాయం తగ్గి ఇతర వృత్తులకు వెళ్లలేక జీవితాలను నెట్టుకొస్తున్న చేనేతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని బిజెపి ప్రొద్దుటూరు నియోజకవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చేనేత పరిశ్రమ వారి అభివృద్ధిని ఆకాంక్షించి 2015ఆగస్టు 7వ తేదిన కేంద్ర ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవంగా గుర్తించిందన్నారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం చేనేతలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం యొక్క పథకాలను అమలు చేయడంలో విఫలం కావడంతో చేనేతలకు మొండి చేయి మిగిలింది అన్నారు. జిల్లాలోని నాయకులకు, చేనేతల పట్ల చేనేత వృత్తుల పట్ల అవగాహన లేకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయకపోవడం దురదృష్టకరం అన్నారు. చేనేత వృత్తికి సరియైన గిట్టుబాటు ధర లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతలు పవర్లూమ్స్ ఏర్పాటు చేసుకునేందుకు సుమారు 12లక్షల వరకు అవుతుందని, కనీసం 6 నుండి 8లక్షలు సబ్సిడితో ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తే చేనేత రంగం మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే కడప జిల్లాలో జమ్మలమడుగు, మోరగుడి, ప్రొద్దుటూరు, మైలవరం తదితర ప్రాంతాలలో చేనేత వృత్తి ఎక్కువగా ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టి చేనేతల వస్తువుల విక్రయాలకు కడప జిల్లాలో ఒక అంతర్జాతీయ వ్యవస్థను ఏర్పాటు చేసి చేనేతలను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చేనేత నాయకులు, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమల్ల నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఆలూరు శరత్ బాబు, పల్లా శ్రీనివాసులు, అల్లా వెంకట సుబ్బయ్య, రామచంద్ర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

రాజంపేట అర్బన్, ఆగస్టు 07, ప్రభాతవార్త:



బదిలీ విధానంలో పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహించిన 15మంది కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం రాజంపేట పట్టణంలోని ఎన్జిఓహోమ్‌లో మున్సిపల్ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నాలుగు నెలల వేతనం నిలబెట్టి పారిశుద్ధ్య కార్మికుల పొట్ట కొట్టడం సమంజసం కాదన్నారు. పారిశుద్ధ్య కార్మికులందరూ పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారని, కనీసం వారు ఇంటి అద్దె చెల్లించే స్థోమత కూడ లేక దుర్భర జీవితాలు గడుపుతూన్నరని ఆవేదన చెందారు. పలుమార్లు మున్సిపల్ కమీషనర్‌ను కలిసి విన్నవించినా కార్మికుల వేదన పట్టించుకోక కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మున్సిపల్ ఏ.ఈ మల్లేష్‌ను కలిసి ఇంటి ఖర్చుల నిమిత్తం పారిశుద్ధ్య కార్మికులకు కనీసం రూ.వేలు మంజూరు చేయమని ప్రాధేయపడినప్పటికి కమీషనర్‌తో చర్చించిని ఏఈ నేటికి వారం కావస్తున్న స్పందన లేదన్నారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యధోరణి వదిలి వేతనాలు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో కార్మికులతో కలిసి కార్యాచరణ రూపొందించి ఉద్యమానికి సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి రమణ, డి.లక్ష్మిదేవి, కె.ప్రసాద్, ఎం.వెంకటరమణ, ఎం.ఎల్లయ్య, సి.నరసింహులు, సి.కోనయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను రీ వెరిఫికేషన్ చేయాలి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 7,ప్రభాతవార్త:



ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను రీ వెరిఫికేషన్ చేయాలని రాయచోటి ఆర్డిఓ రంగస్వామి పేర్కొన్నారు. బుధవారం తాసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ నిర్వహించి వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003 సంవత్సరం అంతకు ముందు అసైన్ ఇచ్చిన భూములను వీఆర్వోలు గ్రామాలలో రీ వెరిఫికేషన్ చేయాలని సూచించారు. డికేటి భూములను అమ్మిన, కొనినా వారి వద్ద నుంచి సరైన రికార్డులు ఉన్నాయ లేదా పరిశీలించి రైతు అనుభవంలో ఉంటే గ్రామంలో పంచనామ చేసి భూ హక్కుదారునికి దక్కేటట్లు చూడాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూములు 3431 సర్వే నెంబర్లు ఉన్నాయని అన్ని నెంబర్లను పరిశీలించాలని అందులో 5409 ఎకరాల భూములకు పట్టాలు అందేటట్లు చూడాలన్నారు. ప్రతి గ్రామంలో మండల గ్రామ సర్వేర్, వీఆర్వోలు కలిసి ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులు కూడా పరిశీలించి ఆర్చైవ్ పేజి నందు కొనుగోదారడు, అమ్మినవారినుంచి సరైన రికార్డులు పొందారా లేదా వాటిని కూడా పరిశీలించాలన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల వివరాలు పక్కగా ఉండాలన్నారు. రైతు సాగు అనుభవంలో ఉంటే ఎన్ని సంత్సరాల నుంచి ఆ రైతు అనుభవంలో ఉందో పరిశీలించి నివేధిక లు ఉన్నాతాధికారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తాసిల్దార్ రెడెన్న, ఎంఆర్ఐ సమ్మద్ ఖాన్, మండల సర్వేయర్ కరీముల్లా, వీఆర్వోలు, పుష్పరాజు, విజయ, సిద్దయ్య, వెంకోజీ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ చేనేత వస్త్ర దినోత్సవం

పీలేరు, ఆగస్టు 07 ప్రభాతవార్తః

నియోజకవర్గంలోని వాల్మీకిపురంలో ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాల్మీకిపురం నందు జాతీయ చేనేత వస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ జె.కష్ణమూర్తి మాట్లాడుతూ హ్యాండ్లూమ్స్‌ను వాడకం ద్వారా చేనేత పరిశ్రమలను కాపాడాలని తెలియజేశారు. కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్ .నారాయణస్వామి మాట్లాడుతూ దేశంలో చేతి వత్తుల పరిరక్షణకు ప్రభుత్వం ఎంతగానో కషిచేస్తుంది పరిరక్షణకు ప్రభుత్వం ఎంతగానో కషిచేస్తుందని అందుకు సంబంధించిన ఉదాహరణలతో విద్యార్థులకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల డీఆర్సీ విజయలక్ష్మీ మాట్లాడుతూ భారతదేశంలో వారసత్వత్తి అయినటువంటి ఈ చేనేత పరిశ్రమను కాపాడాలని, ఈఅంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో హరిత, హర్షిత, తేజశ్రీలు బహుమతులు గెలుచుకున్నారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలల ఎన్నికలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు

ముద్దనూరు, ఆగస్టు 07, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఎన్నికలు గురువారం నాడు నిర్వహిస్తున్న సంధర్భంగా బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, ఎంఈఓ, ఎస్ఐ మైనుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో తహసీల్దార్ రామకుమారి పాఠశాలల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలి

ముద్దనూరు, ఆగస్టు 07, ప్రభాతవార్త:



మండలంలోని చింతకుంట గ్రామంలో సాగుచేసిన పంటలను బుధవారం పరిశీలించి అనంతరం పంట నమోదు చేసే కార్యక్రమంను పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి.వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను, ప్రతి సర్వే నెంబరును పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు చేయించుకోవడం వల్ల వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకంను రైతులు లబ్ధి పొందవచ్చును అని తెలిపారు. ముద్దనూరు మండలంలో ఇప్పటివరకు ఖరీఫ్ సీజన్‌లో 744హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసి ఉన్నారని తెలిపారు. ప్రతి రైతు తప్పకుండా ఆయా రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ నెంబర్ తీసుకుని వెళ్లి వివరాలు అందించి పంట నమోదు చేయించుకోవాలని కోరారు. పంట నమోదు చేసుకోవడము వల్ల రైతులు పండించిన ధాన్యపు ఉత్పత్తులు మార్కెట్ ధర కంటే తక్కువ ఉన్నప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్దతు ధరకే అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది అని తెలిపారు. అలాగే ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు పంట నష్ట పరిహారం పొందుటకు, పంటల భీమా పొందుటకు అవకాశం ఉంటుంది అని తెలిపారు. అలాగే పంట నమోదు ద్వారా పంట రుణాలు పొందవచ్చును అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.యస్.కె సిబ్బంది బి.గంగయ్య మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రాజంపేట తహసీల్దార్‌గా మహబూబ్ చాంద్

రాజంపేట అర్బన్, ఆగస్టు 07, ప్రభాతవార్త:



రాజంపేట తాసిల్దార్‌గా మహబూబ్ చాంద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇక్కడ పనిచేస్తున్న సుబ్రమణ్యం రెడ్డిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇక్కడికి ఇన్బునాదన్ వచ్చారు. తాజాగా మహబూబ్ చాంద్‌ను రాజంపేట తాసిల్దారుగా జిల్లా కలెక్టర్ నియమించడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. కొత్త తహసీల్దార్‌కు ఆర్ఐ రాజేష్, కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తాం

పీలేరు,ఆగస్టు 07 ప్రభాతవార్తః



ప్రజా రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని డీఎం బండ్లకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో పీలేరు డిపోకు నూతనంగా వచ్చిన మూడు నూతన బస్సులను ఉదయం పూజలు నిర్వహించి బస్సులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు-సుండుపల్లె పల్లెవెలుగు సర్వీసు, పీలేరు-తిరుపతి పల్లె వెలుగు, పీలేరు - తిరుపతి ఎక్స్‌ప్రెస్ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే త్వరలో నాలుగు పల్లె వెలుగు సర్వీసులు, మూడు ఎక్స్‌ప్రెస్‌లు డిపోకు రానున్నట్లు ఆయనతెలిపారు. ప్రయాణికుల సంక్షేమమే ఆర్టీసీ ప్రధాన ధ్యేయమన్నారు. ఈకార్యక్రమంలో బస్‌స్టేషన్ మేనేజరు బాబునాయక్, ఏడీసీ హనీఫ్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అన్నమాచార్య యూనివర్సిటీలో ఎన్.సి.సి చెట్లు నాటే కార్యక్రమం

రాజంపేట అర్బన్, ఆగస్టు 07, ప్రభాతవార్త:



"వృక్షో రక్షితి రక్షిత:" అనే ధ్యేయంతో రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటి ఎన్‌సిసి యూనిట్ ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎం.వి నారాయణ హాజరయ్యారు. మొక్కలు నాటే కార్యక్రమంలో గంగిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.రమేష్‌కుమార్ రెడ్డి, డాక్టర్ బి.నాగముని, అన్నమాచార్య యూనివర్సిటి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, ఏఐటిఎస్ ఎన్‌సిసి కేర్ టేకర్ ఆఫీసర్ ఎన్.దీప్తి, ఏఐటిఎస్ అసిస్టెంట్ పిడి ఎస్.సైపుల్లా, ఎన్.సి.సి విద్యార్థులు హాజరయ్యారు.

## మినీ గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

రాజంపేట అర్బన్, ఆగస్టు 07, ప్రభాతవార్త:

రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేటలోని మినీ గురుకుల పాఠశాలను బుధవారం రాజంపేట సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా గురుకులంలో విధ్యార్థులకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారనే అంశాలపై అను అనువునా క్షున్నంగా పరిశీలించారు. ముఖ్యంగా ఆర్ఓ వాటర్ ప్లాంట్ పనిచేస్తుందా లేదా? మంచి నీటి కుళయిలు ఎలా పనిచేస్తున్నాయని వాటిని స్వయంగా తిప్పి పరిశీలించారు. అనంతరం స్టోర్ రూంను పరిశీలించాక అక్కడే ఉన్నటువంటి బియ్యము ఇతర సరుకులను పరిశీలించారు. మినీ గురుకులంలో కల్పిస్తున్న వసతులపై అక్కడ ఉన్న విధ్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధ్యార్థులకు వసతులు కల్పించాలని మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని అక్కడ ఉన్న సిబ్బందికి సూచించారు. అదేవిధంగా విద్యలో ఏ విధ్యార్థి కూడ వెనుకపడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకొని తీర్చిదిద్దాలని ఆదేశించారు.



## రైతు భరోసాకు రాణి సిబ్బంది

ముద్దనూరు, ఆగస్టు 07, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని బందులకుంట రైతు భరోసా కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించలేదని ఆ గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రైతులు వివిధ కారణాల వలన రైతుభరోసా కేంద్రం దగ్గరికి ఉదయం నుంచి వేచి ఉన్న సిబ్బంది ఎవరూ లేకపోవడంతో, ఆర్బికే కేంద్రానికి తాళం వేసి ఉండడంతో నిరుత్సాహపడి వెనక్కి వెళ్లిపోయారు. అదేవిధంగా వారు మాట్లాడుతూ మండలంలోని సచివాలయంలో కూడ ఇలానే వ్యవహరిస్తున్నారని తెలిపారు. మండల ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## వీరబల్లి తహసీల్దారుగా శ్రావణి బాధ్యతలు

రాయచోటి, ఆగస్టు 7, ప్రభాతవార్త:



వీరబల్లి మండలం తహసీల్దారుగా శ్రావణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో గాలివీడు తహసీల్దారుగా పనిచేయడమే కాకుండా కలెక్టరేట్‌లో కూడా కొంత కాలం పనిచేశారన్నారు. అదే విధంగా వీరబల్లి మండలంలో గత కొన్నేళ్లు దాదాపు మూడు సంవత్సరాలు డిప్యూటీ తహసిల్దారుగా పనిచేస్తున్నట్లు వారు తెలిపారు. ఈమెను పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ షాక్ తగిలి మహిళ మృతి,

మైదుకూరు ఆగష్టు 7, ప్రభాతవార్త :

మైదుకూరు మునిసిపాలిటీ 20వవార్డు లింగాలదిన్నే గ్రామంలో ధనికల చిన్నక్క (28) బుధవారం తన పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తు నీళ్ల కొసమని మోటర్ దగ్గరకు వెళ్ళగా ప్రమాదవశాత్తు కరెంటు తగిలి మరణించింది. చిన్నక్కకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్నక్క మరణంతో లింగాలదిన్నే గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. పోష్టుమార్టం నిమిత్తం ఆమెనుప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.